
# జీతాల రోజు.

ఎప్పుడెప్పుడు అయిదు గంటలవుతుందా అనుకుంటూ నిముషానికో సారి తన రిస్ట్‌వాచీవేపు చూసుకుంటున్నాడు కాశీపతి. నాలుగున్నర యింకా అరగంట అంటే ముప్ఫయి నిమిషాలు పద్దెనిమిది వందల సెకన్లు. ఎందుకో కాశీపతికి కాలం స్థంభించి పోయినట్టు అన్పిస్తోంది.




కాశీపతి క్లర్కుగా పనిచేసే ఆ ఆఫీసు ఓ ప్రయివేట్ కంపెనీకి సంబంధించింది. ఆ ఆఫీసులో ప్రతినెలా ఆఖరిరోజు సాయంత్రం అయిదు గంటలు దాటాక ఆ తర్వాత నెలకు సంబంధించిన జీతాలిస్తారు. అందుకే ప్రతినెలా ఆఖరిరోజు ఆఆఫీసులో పనిచేసే వాళ్ళందరి ముఖాలూ అమితమయిన ఆనందంతో వెలిగిపోతుంటాయి.

కాశీపతికి ఆ సీట్లో యింకా కూర్చోవడం చాలా కష్టంగా వుంది. ఫైలు ముందేసుకున్నాడేగానీ అతడి మనసు దానిమీద కించిత్తు కూడా లగ్నం కావడంలేదు. అలాగని గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటే ఆఫీసర్ చూసి అగ్గిరాముడయిపోతాడు. అందుకని ఓ చిత్తుకాగితాన్ని ఫైల్లో పెట్టుకుని దానిపై జీతంలోంచి దేనికెంత ఖర్చుపెట్టాలో లెక్కవేసుకుంటున్నాడు.

ఇప్పుడే కాదు....

ప్రతినెలా యిరవయ్యో తారీఖునుండి కాశీపతి తనకు రాబోయే జీతంగురించి ఆలోచిస్తూ అలా లెక్కలు వేసుకుంటూ వుంటాడు. 'తెలుగులో అంతర్జాతీయ చలనచిత్రం రావడం ఎంత కష్టమో కాశీపతి దగ్గరనుండి ఐదు రూపాయలయినా అప్పు యిప్పించుకోవడం అంత కష్టమండోయ్" అని వాళ్ళ ఆఫీస్‌లో పనిచేసే రామ్మూర్తి అంటూ వుంటాడు.

"ఇండియా లెవెల్లో ఎవరయినా ఆలిండియా మైజర్స్ అసోసియేషన్ అనేదాన్ని స్థాపించ గలిగితే.... ఆ అసోసియేషన్‌కి పోటీ లేకుండా ప్రసిడెంట్ పోస్టుకు ఏకగ్రీవంగా ఎన్నిక కాగల అన్ని అర్హతలూ కాశీపతికి పుష్కలంగా వున్నాయండోయ్" అని కాశీపతికి తెలియకుండా అతని గురించి గర్వంగా అప్పుడప్పుడూ అంటూ వుంటాడు.

"ఈ పిసినారిని కట్టుకున, ఆ మహా ఇల్లాలెవరో గానీ పెళ్ళి అయినప్పటి నుండి ఒక్కనాడయినా ఓ మూర మల్లెపూలను కాశీపతి చేత కొనిపించి వుంటే మనం ఆమెను సన్మానించవచ్చు" అంటూ కాశీపతి గురించి చాటుగా అంటూ వుంటుంది టైపిస్ట్ అరుణ.

కాశీపతి ఇటీవలే యం.కాం ఫస్ట్‌క్లాస్ పట్టా పుచ్చుకున్నాడు. ఎంత ప్రయత్నించినా అతడికి గవర్నమెంట్ జాబ్ దొరకలేదు. ఆవు సూడిగా వున్నప్పుడు మంచి రేటు పలికినట్లు. పెళ్ళికావలసిన అబ్బాయి ఉద్యోగిగా వుంటే కట్నం ఎక్కువ పలుకుతాడని కాశీపతికి తెలుసు. అందుకే నిరుద్యోగిగా వున్నన్నాళ్ళూ అతడు పెళ్ళిచేసుకోలేదు.

ఒయిదు సంవత్సరం క్రితం కాశీపతికి ఆ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం దొరి

కింది. వెంటనే పెళ్ళిచేసుకోమ్మని వాళ్ళమ్మ నాయనమ్మ బలవంతం చెయ్యడంతో కాశీపతి పెళ్ళికి ఒప్పుకోవలసి వచ్చింది. మరో రెండు నెలల్లో అందమయిన అమ్మాయి 60 వేల రూపాయల కట్నంతో ముప్ఫయి సవర్ల బంగారంతో ఆ యింటికి కోడలుగా రావడం జరిగింది.

❊ ❊ ❊

ఆఫీస్ గడియారం సరిగ్గా అయిదు గంటలు కొట్టింది. ఆ శుభసమయం కోసమే ఎదురు చూస్తున్న కాశీపతి గుండెనిండా గాలి పీల్చుకుని గబుక్కున ఫైలు మూసేసి చిత్తు కాగితాన్ని జేబులో వేసుకున్నాడు. కుర్చీలోంచి పైకి లేచి కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ యివతలకి వచ్చాడు కాశీపతి. పావుగంటలో తన జీతం డబ్బులందుకున్నాడతడు.

కాశీపతి షర్ట్ జేబు జీతం డబ్బులతో నిండుగా వుంది. హుషారుగా ఈలవేసుకుంటూ ఫుట్‌పాత్ మీద మెల్లగా నడుస్తున్న కాశీపతి పక్కనే ఎయిర్ కండీషన్ హోటల్ కనుపించింది. అతడు ఆ హోటల్‌కి ఎప్పుడూ వెళ్ళలేదు. ఏమయినా సరే ఇవాళ ఆ హోటల్ కెళ్ళి కమ్మని కాఫీ తాగిరావాలని నిర్ణయించుకున్నాడు.

అలా అనుకోగానే తనకు తెలిసిన వాళ్ళుగానీ తన ఆఫీసు వాళ్ళుగానీ ఎక్కడయినా వున్నారేమోనని ఓసారి చుట్టూ కలయచూశాడు. కారణం తను వెళ్ళడం తనకు తెలిసిన వాళ్ళెవరయినా ఆ హోటల్లోకి దూరి తన పక్కనే వచ్చి కూర్చొంటే సభ్యత కోసమైనా ఏం తీసుకుంటారు? అని అడగాలి తనే బిల్ చెయ్యాలి. అదీ కాశీపతి భయం.

హోటల్లోకి దూరి ఓమూల ఖాళీగా వున్న టేబుల్ ముందు కూర్చున్నాడు. లోపల లైట్ డిమ్‌గా వుంది. ఎక్కడినుంచోగానీ వెస్ట్రిన్ మ్యూజిక్ లైట్‌గా వినిపిస్తోంది. ఆ వాతావరణం బాగా నచ్చింది కాశీపతికి. టిఫిన్ కూడా తినాలనిపించి ఆనియన్ దోసెకు ఆర్డర్ ఇచ్చాడు. అయిదు నిముషాల్లో ఆ దోసెను తీసుకొచ్చి కాశీపతి ముందుంచాడు సర్వర్.

టిఫిన్ తింటుంటే అతడికి ఆవాళ భార్య నుండి వచ్చిన ఉత్తరం గుర్తొచ్చింది. అతడి భార్య నెలరోజుల క్రితం కాన్పు కోసం పుట్టింటికి హైదరాబాద్ వెళ్ళింది. మిమ్మల్ని చూడాలని వుంది. మీరు ఆఫీసుకి మూడు రోజులు సెలవుపెట్టి హైదరాబాద్ రండి. అంటూ ఉత్తరం రాసిందామె. కానీ కాశీపతి వెళ్ళడానికి యిష్టపడడం లేదు.

కారణం ఆఫీసులో సెలవు దొరకడం చాలా కష్టం. ముఖ్యంగా హైదరాబాద్‌కు వెళ్ళిరావడమంటే కనీసం రెండు వందలయినా ఖర్చు అవుతాయి. అసలు ఇలా వెళ్ళడం రావడం జరుగుతూ వుంటుందని అందుకు కనీసం వెయ్యి రూపాయల పైనే అవుతుందని భార్యను కాన్పుకు పుట్టింటికి పంపడానికి మొదట్లో ఒప్పుకోలేదు కాశీపతి.

కానీ భార్యని యిక్కడే నర్సింగ్‌హోంలో చేర్పిస్తే.. తను రోజూ వెళ్ళిరావడం డాక్టర్ ఫీజు బారసాలకు సంబంధించిన ఖర్చులు వీటన్నింటి గురించి, పైగా తల్లినీ, బిడ్డనూ తన కడకు పంపేటప్పుడు బిడ్డ మెడలో వాళ్ళు ఓ సవర గొలుసు వేస్తారని అతడికి తెలుసు.

టిఫిన్ తినడం ముగించి కమ్మని కాఫీ తాగాడు. సర్వర్ బిల్ తెచ్చి ముందుపెట్టాడు. అయిదు రూపాయలు. చాలా కాస్ట్లీ అనుకుంటూ అయిదు రూపాయలనోటు తీసి అందులో వుంచాడు కాశీపతి. సరిగ్గా అప్పుడే ఆ అయిదు రూపాయల నోటువేపూ కాశీపతి ముఖం వేపూ మార్చిమార్చి ఆదోరకంగా చూశాడు సర్వర్.

వాడు టిప్ కోసమని కాశీపతికి బాగాతెలుసు. ఏం కష్టపడి పోయాడని వీడికి టిప్ యివ్వాలి? ఈరోజుల్లో యిలా టిప్ యివ్వడం చాలా మందికి పెద్ద ఫేషనయిపోయింది. ఈ టిప్పు సుల్తాను యిలా పెరిగిపోయారంటే కారణం తప్పు వాళ్ళది కాదు. టిప్పు యిచ్చేవాళ్ళది. ఈ దేశంలో ఫాల్స్ ప్రిస్టేజస్‌కు కొరతలేదు. అనుకున్నాడు కాశీపతి.

హోటల్లోంచి వెలుపలికొచ్చాడతడు. అక్కడే ఒక కిళ్ళీ కొట్టుంది. ఆ కొట్టు ముందు నిలబడి ఓ కారా కిళ్ళీ కట్టించుకుని ఓ గోల్డ్‌ఫేక్ కూడా తీసుకున్నాడు. సిగరెట్‌ని వెలిగించుకోకుండా కుడిచేతిలో రెండు వేళ్ళ మధ్య పెట్టుకుని కారా కిళ్ళీ నములుకుంటూ ఫుట్‌పాత్ మీద మెల్లగా హుషారుగా నడక సాగించాడు కాశీపతి.

"సార్!"

వెనకనుండి ఎవరో పిలవడంతో చటుక్కున ఆగి వెనుతిరిగి చూశాడు. పాతికేళ్ళ యువకుడు దీనంగా చూస్తూ అక్కడ నిలబడి వున్నాడు. అతడి బట్టలు నల్లగా మాసిపోయి వున్నాయి. జుట్టు చెరిగిపోయింది. కళ్ళు పీక్కుపోయి వున్నాయి. భోంచేసి రెండు రోజులయినట్లు అతడి కడుపు వెన్నెముకకు అతుక్కుపోయినట్లుంది.

"సార్! నాపేరు లక్ష్మీపతి.... మాది...."

"ఇక చెప్పొద్దు. మీది ఈ వూరు కాదు. ఈ వూరికి ఏదో ఉద్యోగం కోసం వచ్చావు. లేదా మరేదో పనిమీద వచ్చావు. అయితే నీ సూట్ కేస్‌ను ఎవరో కొట్టేశారు. తిరిగి వెళ్ళడానికి కూడా నీ దగ్గర డబ్బుల్లేవు. నువ్వు భోంచేసి రెండు రోజులయింది. కనుక నీకు నేను పదో పాతికో యిచ్చుకొని సహాయం చెయ్యాలి అంతేనా?" అన్నాడు కాశీపతి.


అవును అన్నట్లుగా తల ఆడించాడే తప్ప ఆ యువకుడు బదులు మాట్లాడలేదు. కాశీపతి మాటలలోని వ్యంగ్యం అతడిని అవమానపరిచి తలవంచుకునేటట్లు చేసింది.

చూడు నాయనా! ఇలాగా డ్రామాలేసే నీలాంటి వాళ్ళను బోలెడమందిని చూశాను. నీలాంటి వాడి మాటల్ని నమ్మే ఓ అమాయక శిఖామణులు దేశంనిండా ఉన్నారు. వాళ్ళ దగ్గరికెళ్ళి ఈ ఫీలింగ్ ఫేస్‌పెట్టి దీనంగా రెండు డైలాగ్స్ చెప్పేయ్. అయిదో పదో ఇస్తారు. మొత్తానికి క్లాసికల్ బెగ్గింగ్‌కి మంచి మార్గాన్నే ఎన్నుకున్నావు- లక్ష్మీపతీ నీ పేరు! గొప్ప సార్థక నామధేయుడవే వెళ్ళు వెళ్ళు- అంటూ కసురుకున్నాడు కాశీపతి.

ఈ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగానికి ఇంటర్‌వ్యూ జరిగినప్పుడు.... ఈ ఉద్యోగం తనకు వస్తే కొండకు వచ్చి దర్శనం చేసుకుని దేవుని హుండీలో వందరూపాయలు వేస్తానని కాశీపతి ఏడుకొండల వానికి ఓ మొక్కు మొక్కుకున్నాడు. తీరా ఉద్యోగం వచ్చాక వందరూపాయలే? అనుకున్నాడతను. మొక్కుబడి విషయంలో తొందరపడినట్లు తర్వాత అనిపించింది కాశీపతికి.

అతడికి పాపభీతి ఎక్కువ. అందుకే తిరుమల వెళ్ళి తన మొక్కుబడి చెల్లించుకోవాలని చాలా రోజుల నుండి అనుకుంటూనే ఉన్నాడు కాశీపతి, కానీ మూడురోజులు సెలవు దొరకక తన ప్రయాణాన్ని వాయిదా

# వయసు



కాలేజీలో ఇంటర్ ఫస్టియర్‌లో చేరిన అర్చనను మేడమ్ అడిగింది-

"నీ వయసెంత?"

"పదహారేళ్ళు మేడమ్" అంది.

"మీ అమ్మగారి వయసు?"

"పదహారు మేడమ్"

"మీ బామ్మగారి వయసు?"

"పదహారు మేడమ్" అంది.

"అలాగా! మీ మామ్మగారు ఏం చేస్తారు?" మళ్ళీ అడిగింది మేడమ్.

"సినీతార "పావ" మా బామ్మే మేడమ్" అంది.

వేసారపు మాధవయ్య

వేసుకుంటూనే ఉన్నాడు. పైగా తను తిరుమల బయలుదేరితే భార్య కూడా తన వెంట వస్తుంది. బోలెడంత ఖర్చు అని అతడి భయం.

ఆ రాత్రి ఇంట్లో పడుకుని ఉండగా కాశీపతికి గొప్ప అయిడియా వచ్చింది. భార్య రాసిన ఉత్తరాన్ని తను ఆఫీస్ మేనేజర్‌కు చూపెడితే కనీసం రెండు రోజులయినా సెలవిస్తాడు. కడుపుతో ఉన్న భార్య కోరికను కాదనలేక మేనేజర్ తప్పక సెలవిస్తాడు. భార్యను చూడ్డానికి వెళుతున్నట్టు చెప్పి.... తను తిరుమలకు వెళ్ళి వచ్చెయ్యవచ్చు.

తనకంత గొప్ప అయిడియా వచ్చినందుకు చాలా మురిసిపోయాడు కాశీపతి. మరునటి రోజు రోజు అనుకున్నట్టుగానే కాశీపతి తన భార్య రాసిన ఉత్తరం చూపెడితే మేనేజర్ సెలవు ఇచ్చాడు.

ఆ రాత్రే రైల్లో బయలుదేరాడు కాశీపతి. ఓ చిన్న బ్రీఫ్‌కేస్‌లో ఓ జత బట్టలూ- ఓ లుంగీ, టవలూ, సోపూ, టూత్‌పేస్టూ- బ్రష్షూ పెట్టుకున్నాడు. ఆ రాత్రంతా కాశీపతి కంటి మీద రెప్పవెయ్యలేదు. నిద్రపోతే బ్రీఫ్‌కేస్ మాయమౌతుందేమోనని అతని భయం.

ఉదయం ఏడుగంటలకు రైలు తిరుపతి చేరింది. అక్కడి నుండి తొమ్మిది గంటలకల్లా కాశీపతి తిరుమలకు చేరుకున్నాడు. తిరుమల మీద దొంగలు ఎక్కువని ఎవరో చెప్పారట. అందుకే చాలా జాగ్రత్తగా ఉండాలనుకున్నాడతడు. తిరుమలలో కాటేజ్ తీసుకుందామనుకున్నాడు కాశీపతి. కాటేజ్ అంటే ఇరవయ్యో సాతికో అవుతుంది. పైగా పాయంత్రమే తను తిరుగు ముఖం పట్టాలి. ఈ మాత్రానికి కాటేజ్ ఎందుకులే అనుకున్నాడు కాశీపతి.

కళ్యాణ కట్టలో గుండు గీయించుకుందామని అతడు అనుకున్నాడు. కానీ గుండు చూస్తే తను తిరుమల వెళ్ళినట్లు ఆఫీస్ మేనేజర్‌కు స్పష్టంగా తెలిసిపోతుంది. పైగా తన కర్లింగ్ హేర్స్ మళ్ళీరావడానికి కనీసం మూడు నెలలయినా పడుతుంది. అలా ఆలోచించిన కాశీపతి గుండు ప్రయత్నం విరమించుకుని కోనేటి స్నానానికి వెళ్ళాడు.

గుండు గీయించుకున్న వాళ్ళూ, గీయించుకోని వాళ్ళూ కోనేటిలో కుట్టూ నీళ్ళలో మునకలు వేస్తూ స్నానాలు చేస్తున్నారు. కాశీపతి పాంటూ షర్టూ తీసేసి.... ఓ పాత పేపర్లో వాటిని చుట్టి.... మెట్టు మీద ఉన్న తన బ్రీఫ్‌కేస్ మీద పెట్టి కోనేటిలోకి దిగి ఓ మునక వేశాడు. అంతే తన చుట్టూ ఉన్న వాళ్ళు కోతి కోతి అని గట్టిగా అరిచారు.

తలతిప్పి చూసిన కాశీపతికి గుండె ఆగిపోయినంత పని అయింది. బ్రీఫ్‌కేస్ మీద పేపర్లో చుట్టిపెట్టిన బట్టలను ఏదో తినుబండారం అనుకొని ఓ కోతి తీసుకెళ్ళి పోతూ పోతూ ఉంది. కాశీపతి కోనేటిలోంచి రాకముందే ఆ కోతి కనుమరుగైపోయింది. కాశీపతికి కన్నీళ్ళు వచ్చాయి. బట్టలు పోయినందుకు కాదు. పాంటు జేబులోని డబ్బంతా పోయినందుకు.

సూట్‌కేస్‌లోని బట్టల్ని తీసి వేసుకుని తిరిగి ప్రయాణమయ్యాడు కాశీపతి. ఆపకి దగ్గర ఓ పైసా కూడా లేదు. ఏం చేయాలో కాశీపతికి పాలుపోవడం లేదు. చీకటి పడేసరికి తిరుమల నుండి కాలినడకతో తిరుపతి చేరుకున్నాడు. బజార్లో నడుస్తుంటే కాశీపతికి ఓ బోర్డు కనిపించింది. దానిమీద శ్రీగోవిందరాజస్వామి ఆర్ట్స్ కాలేజి హాస్టల్ అని ఉంది.

తిరుపతిలో తనకు తెలిసిన వాళ్ళెవరూ లేరు. ఈ కాలేజీ స్టూడెంట్స్‌కు తన పరిస్థితి గురించి చెప్పి సాయం చెయ్యమంటే.... తప్పక హెల్ప్ చేస్తారు. అలా అనుకుని హాస్టల్ ముందుకు వచ్చి అక్కడ గుంపుగా ఉన్న స్టూడెంట్స్‌తో తన పరిస్థితి గురించి చెప్పాడు కాశీపతి.

చూడు బ్రదరూ! ఇలా డ్రామాలేసే నీ లాంటి వాళ్ళను చాలా మందిని చూశాం. ముందు మంగలిషాపుకెళ్ళి గుండు చేయించుకుని వచ్చి అమాయకుల దగ్గరకెళ్ళి ఈ డైలాగ్స్ చెప్పు. అప్పుడు నీ గుండునయినా చూసి నీ కట్టు కథను నమ్మి అణాదో పదో ఇస్తారు. మొత్తానికి క్లాసికల్ బెగ్గింగ్‌కి మంచిమార్గాన్నే ఎన్నుకున్నావు— అంటూ స్టూడెంట్స్ నగలబడి నవ్వారు.

అవమానంతో తలొంచుకున్నాడు కాశీపతి. రెండు రోజుల క్రితం.... తన స్థితిలో తనకు ఎదురుపడి సాయం అడిగిన లక్ష్మీపతి ... అతడిని తను అన్న మాటలు హఠాత్తుగా గుర్తొచ్చాయి కాశీపతికి. నిజమే.... ఎదుటి మనిషి కష్టాల్లో ఉండి సహాయం చెయ్యమని అడిగితే అతడి మాటల్ని నమ్మని నేను....

ఇప్పుడు నా మాటల్ని ఎదుటి మనిషి నమ్మాలనుకోవడం అవివేకమే. ఈ వ్యవస్థలో ఎదుటి మనిషిని నేను నమ్మనప్పుడే.... నన్నూ మరొకరు నమ్మరు. ఇది నగ్నసత్యం.

అనుకున్నాడు కాశీపతి.



## జయా తిరిగొస్తోందా!

జయా బాధురి, అమితాబ్ బచ్చన్‌తో వివాహానంతరం సినిమాలకు గుడ్ బై చెప్పింది. అయితే ఇటీవలనే ఆమె వివేక్ విశ్వాని నిర్మిస్తున్న చిత్రంలో నటించేందుకు అంగీకరించిన వార్త సంచలనాన్ని రేకెత్తించింది. ఆవేక్ పదమ్‌సీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నటన చేసేందుకు మొదట అంగీకరించిన విషయం వాస్తవమే కానీ, వారం రోజుల తరువాత ఆ చిత్ర నిర్మాత- దర్శకులు ఆ ఆలోచన విరమించుకున్నారని కొందరు అంటున్నారు.

